క్లుప్తంగా

చంద్రప్రభ వాహనంపై శ్రీరంగనాథుడు



పులివెందుల టౌన్ : స్థానిక శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ పవిత్రోత్సవాల్లో భాగంగా ఐదవరోజు శనివారం శ్రీరంగనాథుడు చంద్రప్రభ వాహనంపై సతీసమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. వన భోజన కార్యక్రమాలను నిర్వహిస్తువస్తున్నారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కేవీ రమణ, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఫీజు చెల్లించండి

పులివెందుల టౌన్ : 2024 మార్చిలో జరుగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఫెయిల్ అయిన ప్రైవేట్ విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజును చెలించాలని వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ పరీక్ష ఫీజులను వారు చదివిన కళాశాలలో చెల్లించాలని ఆయన తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రొఫెసర్ ఏడుకొండలును సత్కరిస్తున్న కళాశాల డీన్, సిబ్బంది

పులివెందుల టౌన్ : స్థానిక ఆహారవిజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలకు చెందిన ప్రొఫెసర్ ఎల్.ఏడుకొండలు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.భేగ్ మాట్లాడుతూ ఏడుకొండలు ఇప్పటికే యూనివర్శిటీకి చెందిన ఉత్తమ మెరిటోరియల్ టీచర్ అవార్డును అందుకున్నారన్నారు. చాలా చిన్న వయసులో ప్రొఫెసర్ అవ్వడం అభినందనీయమన్నారు. ఏడుకొండలు ప్రతిభను గుర్తించి ఏపీ రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయుడు పురష్కారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం



ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్మన్, కమిషనర్‌లు

పులివెందుల టౌన్ : బాల్య వివాహాలు అరికడదాం అంటూ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మెప్మా సంఘ సభ్యులతో కలిసి శనివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. బాలికల వివాహ వయస్సు 18 సంవత్సరాలు పూర్తి అవ్వకముందే ఎవరైనా వివాహాలు చేస్తుంటే వెంటనే పోలీసులకు, చైల్డ్‌కేర్ సెంటర్లకు సమాచారం అందించాలన్నారు. వివరాలు తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతారన్నారు. ర్యాలీ మెయిన్ బజార్, పూలఅంగళ్ల సర్కిల్ వరకు నిర్వహించారు. బాల్యవివాహాలు నిర్మూలిద్దాం, బాలికలను సంరక్షిద్దాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత, సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం రెండవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారు ఆకుకూరలతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దేశంపై ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి

కమలాపురం : యువత దేశం పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని 30వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ రాజ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్‌ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీలో చేరే విద్యార్థులకు ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వారిలో 6 మంది యువతులు, 12 మంది యువకులు ఎంపికయ్యారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులంతా క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి కదిలిన గణనాథులు



జమ్మలమడుగు : వినాయకుడి విగ్రహం తరలిస్తున్న భక్తులు



పులివెందులలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



వీరపునాయునిపల్లె : గ్రామోత్సవంలో గణనాథుడు



పులివెందుల : వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న దేవిరెడ్డి కుటుంబ సభ్యులు



చెన్నూరు : కొండపేటలో లడ్డూను దక్కించుకున్న గుడిపాటి నాగేంద్ర

పులివెందుల టౌన్ : వినాయక చవితి పండుగను పురష్కరించుకుని వాడవాడలలో కొలువుదీరిన గణనాథులను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి శనివారం నిమజ్జనానికి తరలించారు. దారిపొడవునా డప్పు వాయిద్యాలతో, రంగులు చల్లుకుంటూ, చిందులు వేస్తూ గణపతిబప్ప మోరియా అంటూ నినాదాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. ఇందులో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.1.38 లక్షలు పలికిన లడ్డు

స్థానిక పెద్దకొండప్ప కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద శనివారం లడ్డూ వేలం పాటలో సుమన్‌రెడ్డి రూ.1.38లక్షలకు దక్కించుకున్నారు. అలాగే వైఎస్సార్ ఫౌండేషన్ రామట్లపల్లె వీరారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల..

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లగొండువారిపల్లెలో శనివారం వినాయకుడు నిమజ్జనానికి వెళ్తున్న నేపథ్యంలో వినాయక లడ్డూ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన దేవిరెడ్డి కుటుంబ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డిలు రూ.2.30లక్షలకు వేలంపాట పాడి లడ్డూను దక్కించుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. కమిటీ నిర్వాహకులు పలుచోట్ల అన్నదానం, చిన్నారులతో సాంస్కృతిక పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణ సీఐ సదా శివయ్య, ఎస్ఐ నాగరాజు బందోబస్తు చర్యలు చేపట్టారు. పెద్దముడియం మండలంలోని కుందూ నదిలో నిమజ్జన ఏర్పాట్లను అధికారులు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె, మిట్టపల్లె, కొమ్మద్ది, పాలగిరి గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు కాయ కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జన కార్యక్రమంలో పురుషులతో పాటు మహిళలు ఎంతో ఉత్సాహంగా రంగులు చల్లుకొంటూ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గంగిరెడ్డిపల్లెలో నిర్వహించిన లడ్డు వేలంపాటలో నర్రెడ్డి సుధాకర్‌రెడ్డి రూ.23 వేలకు దక్కించుకున్నాడు.

చెన్నూరులో..

చెన్నూరు : మండలంలోని కొండపేటలో గణనాథుడు నిమజ్జనం వైభవంగా జరిగింది. మండపాల వద్ద ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పీర్ల చావిడి వద్ద లడ్డూ వేలం పాటలో అదే గ్రామానికి చెందిన గుడిపాటి నాగేంద్ర రూ.1.30 లక్షలకు దక్కించుకున్నాడు. చెన్నూరు పెన్నా నది వద్ద నిమజ్జనం నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని వినాయకుని విగ్రహం, వల్లూరు ఎస్సీ కాలనీలోని విగ్రహాలకు శనివారం నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాల సమీపంలోని విగ్రహం వద్ద స్వామి వారి లడ్డూ ప్రసాద వేలం పాట నిర్వహించగా పుత్త చిన్నాయపల్లెకు చెందిన శ్రీధర్ రెడ్డి రూ.34 వేలకు దక్కించుకున్నారు. బ్యాండు మేళ వాయిద్యాల నడుమ, బాణా సంచా పేలుస్తూ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.



వల్లూరులో అన్నదానం చేస్తున్న దృశ్యం

త్రిముఖ గణనాథునికి ప్రత్యేక పూజలు

పులివెందుల టౌన్ : వినాయక చవితి పండుగ సందర్భంగా స్థానిక మైత్రి లేఅవుట్‌లో కొలువుదీరిన 11 అడుగుల గంధ త్రిముఖ గణనాథునికి శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

తమిళనాడు అంబూరుకు చెందిన సౌందర్ రాజన్‌చే ఏర్పాటు చేసిన మహాగణపతికి 200 మంది మహిళలచే అర్చకపండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలను వైభవంగా నిర్వహించారు. ఐదు రోజులుగా ఉదయం అష్టోత్తర మహానివేదన, నీరాజనం, సాయంత్రం లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, లక్ష భస్మార్చన, లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఉద యం 9 గంటలకు షోడశ 16 హోమగుండాల శ్రీగణేష హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలు



కొలువుదీరిన త్రిముఖ గణనాథుడు

'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింటి సర్వే

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని యర్రబల్లె, కొత్తపల్లె గ్రామాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్లు సతీష్‌కుమార్, జగదీష్‌లు పర్యవేక్షించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాడన్నారు. జగనన్న సురక్ష ద్వారా ఇంటి వద్దకే వెళ్లి ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, డెంగ్యూ, మలేరియా, కళ్ల పరీక్షలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష ద్వారా వైద్యపరీక్షలు చేస్తున్న సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది

విద్యార్థినులకు రక్త పరీక్షలు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, డాక్టర్ ఫర్జానాల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఇందులో 210 మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. శరీరంలో రక్తశాతం తక్కువగా ఉన్న విద్యార్థినులకు హిమోగ్లోబిన్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫర్జానా విద్యార్థినులు రక్తశాతం పెరిగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

చెన్నూరు : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన గ్రామ సచివాలయం–2లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షపై వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి అక్కడ వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి అన్ని పరీక్షలు చేయించి ఉచితంగా మందులు ఇవ్వాలన్నారు. వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందజేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ప్రతి ఒక్కరికి వైద్య సదుపాయం అందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి

కమలాపురం చెరువుకు మైలవరం నీళ్లు

కమలాపురం : కమలాపురం చెరువుకు మరో రెండు రోజుల్లో మైలవరం నీళ్లు వచ్చి చేరుతాయని హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పందిళ్లపల్లె సమీపంలోని కమలాపురం లింక్ ఛానల్‌లో ప్రవహిస్తున్న మైలవరం నీటిని ఆయన డీఈఈ రంగన్న, ఏఈఈ బాబుతో కలసి పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక పోవడంతో కమలాపురం చెరువుకు నీరు రాలేదన్నారు. దీంతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు మైలవరం అధికారులు దక్షిణ కాలువ ద్వారా కమలాపురం చెరువుకు 30 క్యూసెక్కుల నీళ్లు వదిలారన్నారు. ఆదివారం నుంచి మరో 40 క్యూసెక్కుల నీరు వదులుతారని, మొత్తం 70 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తారని తెలిపారు. ప్రస్తుతం ఆ నీళ్లు పందిళ్లపల్లె వద్ద ఉన్న 10.5 కి.మీ. రాయి వరకు చేరాయని, మరో రెండు రోజుల్లో కమలాపురం చెరువుకు చేరుతాయన్నారు. ఆయకట్టు రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కమలాపురం లింక్ ఛానల్‌లో మైలవరం నీటిని పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

రస్తా అక్రమణకు గురి కాకుండా చూడండి

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు గ్రామంలో సర్వే నంబరు 967లో కొన్ని సంవత్సరాలుగా గ్రామం నుంచి సిద్దారెడ్డి తోటల వరకు రస్తా ఉండేదని ప్రస్తుతం ఆ రస్తాను కొందరు అక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని శనివారం చిలంకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునందన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, కొందరు రైతులు తహసీల్దార్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారించి న్యాయం చేస్తామని తహసీల్దార్ వారికి హామీఇచ్చారు.

26న చేపల చెరువు వేలం పాట

చెన్నూరు : మండలంలోని రాచిన్నాయపల్లె గ్రామ పంచాయతీలో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం చేపల చెరువుకు వేలం పాట వేయనున్నట్లు సర్పంచ్ సొంతం నారాయణరెడ్డి తెలిపారు. రాచిన్నాయపల్లి గ్రామపంచాయతీలో 25 ఎకరాల 84 సెంట్ల విస్తీర్ణంలో చేపల చెరువు ఉందన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి చేపల చెరువు వేలం పాటకు గ్రామపంచాయతీ తీర్మానం చేసిందన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీకి రూ.10వేలు డిపాజిట్ తీసి రసీదు పొందాలన్నారు. అలాగే పాటదారులు రూ.36 వేలకు పైగా ఎవరైతే పాడతారో వారికి మాత్రమే వేలం పాట దక్కుతుందన్నారు.

మాసపత్రిక విడుదల

కమలాపురం : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) సంయుక్తంగా రూపొందించిన 'తిరుగుబాటు' మాస పత్రికను సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి శనివారం విడుదల చేశారు. 1984 నుంచి వస్తున్న ఈ పత్రికలో మేధావులు, సామాజిక వేత్తల వ్యాసాలతో పాటు సామాజిక అంశాలు, భౌగోళిక పరిస్థితులపై కథనాలుంటాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీనాథ్, విశ్వనాథ్, ప్రసాద్, భాను, గణేష్, వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం సేకరించండి

పులివెందుల : అసాంఘిక కార్యకలాపాలపై ముందస్తు సమాచారం సేకరించాలని అర్బన్ సీఐ రాజు తెలిపారు. శనివారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు మహిళా సంరక్షణ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు వారి పరిధిలోని ప్రజలతో సత్సంబంధాలు కలిగి, అసాంఘిక కార్యకలాపాలపై ముందస్తు సమాచారం సేకరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా బాల్యవివాహాలు జరగడం, భూవివాదాలు, నీటి వివాదాలు, తదితర సమస్యలను ముందుగానే గుర్తించి వారిపైన చర్యలు చేపట్టడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు హుస్సేన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పులివెందుల టౌన్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజుల్లాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛసర్వేక్షన్ 2023, ఇండియన్ స్వచ్ఛత, లీగ్ (ఐఎ 2.0) కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్‌తో కలిసి శనివారం స్థానిక భాకరాపురంలోని వెంకటప్ప మెమోరియల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పిల్లలతో స్వచ్ఛసర్వేక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్వచ్ఛసర్వేక్షన్ కార్యక్రమం గురించి విద్యార్థులకు వివరించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్, సచివాలయ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వసతుల కల్పన

కడప కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, బీఆర్ డిపార్ట్‌మెంట్ హాస్టళ్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రకాష్‌నగర్ బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వంటగది స్లాబ్‌కు మరమ్మతులు చేయించి, లైట్లు ఏర్పాటుచేయాలన్నారు. ఖాళీ స్థలంలో షటిల్ కోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లకు తలుపులు, తాగునీటి ఆర్వో ప్లాంట్, మోటారు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ బాలుర కళాశాల హాస్టల్‌లో డైనింగ్ రూమ్ నాణ్యతగా నిర్మించాలన్నారు. ప్రకాష్‌నగర్ బీసీ హాస్టల్‌లో కిటికీలకు మరమ్మతులు చేయించాలన్నారు.



ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

వేముల : గర్భిణులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హసీనా తెలిపారు. శనివారం ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. బాలింతలు కూడా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని మండల ఐసీడీసీ సూపర్‌వైజర్ వసంతకుమారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు సంపూర్ణ పోషణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : కమలాపురం, పెద్దచెప్పలి సెక్టార్లలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ సీడీపీఓ వసంతబాయి పర్యవేక్షణలో శనివారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్లు షంషాద్ బేగం, వెంకటసుబ్బమ్మలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందన్నారు. వైఎస్సార్ కిట్ల ద్వారా దాదాపు 9 రకాల పౌష్టికాహారాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. అలాగే ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, చిక్కీలు తదితర వాటిలో అధిక పోషకాలు ఉంటాయన్నారు. ఇవన్నీ తక్కువ ఖర్చుతో వచ్చే పదార్థాలేనని, వాటిని అధికంగా తీసుకోవాలని సూచించారు. పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలున్న పదార్థాలను అధికంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు, అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వేములలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ హసీనా



కమలాపురంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్‌బేగం

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : చిన్నారులకు పోషకాహారంతోనే ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీ లక్ష్మీదేవి తెలిపారు. శనివారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా మండలంలోని సీఎస్ఎం కాలనీ అంగన్‌వాడీ సెంటర్లో పోషకాహారం యొక్క ప్రాముఖ్యత గురించి గురించి వివరించారు. విద్య ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుభాషిని, సీహెచ్‌ఓ ప్రవీణ అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.